ఈగలు ముసిరే 'సిద్ధాన్నాలు'

ఎస్. ఎన్. ప్రభల

సిద్ధాన్నాలు ముసురుతూన్న యీగలతో సిద్ధంగా ఉన్నాయి! ఏళ్లు ముంచుకొస్తూన్న కొద్దీ ముఖాలు మోటదేరుతున్నాయి. విశ్వవిద్యాలయాలందించిన యోగ్యతాపత్రాలు మట్టిగూట్లో మట్టిగొట్టుకు పోతున్నాయి.

అంతేకాక....అధికస్య అధికం ఫలం అంటున్నారంతా అని, యోగ్యతలు కొట్టిచ్చినట్లవుపిస్తూంటే, అంతకు అంతచెప్పినా 'యింతేనా' అని 'తలుపరా' అనుకుని ఆశతో చెప్పించిన టైపు-షార్టు హాండ్... యిత్యాదులు కూడా—ఏమిటో అవసరమొచ్చినపుడలా పిల్లనివ్వడానికి వచ్చిన వాళ్ళముందర పెడుతూన్నా ఆ అధోగతినుంచి తప్పించుకోలేక 'చెద' బట్టిపోతున్నాయి.

"ఏ ఒక్క చవటకూ ఉద్యోగమూ సద్యోగమూ అంటూ ఏ చచ్చు బండా లేదు!" వీరయ్యగారి మనోవ్యాధి కిదే యించుమించు తొలికారణం.



బ్రహ్మచారి ముదిరినా బెండకాయ ముదిరినా ఫలితం ప్రతివారికీ సువ్యక్తం!

అంటే ముదిరిన బ్రహ్మచారులు అపవాదులు తీసుకువచ్చే కొంటెతనం చేష్టలు చేస్తారనికాదు ఆయన భయం! అనుకున్నంత 'ధర' మాత్రం రాక పోవచ్చుననే ఆ ఆవేదన.

వీరయ్యగారి ముఖం యిదివరకులా అంత ధీమాగా ప్రజ్వరిల్లటంలేదు. 'రోజులు మారిపోతున్నాయ్!'

పాపం! పూర్వం ఆయన యీ నూనుగుమీసాల కుర్రపీనుగుల్ని చూసి ఎంతగా మురిసిపోయేవారు! ఎంతగా క్షుబ్బులయ్యేవారు! గగనసీమల్లో తాను చూసిన వన్నీ గాలిమేడలేనా?

అయినా యిప్పుడాయన ముఖం మాడ్చుకు కూర్చునేందుకు అంత కొంప మునిగిపోలేదు. కాని, ఎటొచ్చీ సాధ్యమైనంత త్వరలో మాత్రం 'అయిందనిపించాలి!'

"లేకపోతే వ్యవహారం చూస్తూండగానే మొదటికే మోసం వచ్చేలాగా ఉంది!'

"వెధవది...కలం పుచ్చుకోవడం చాతనయిన ప్రతివాడూ చేయి తిరిగినట్లు ఊరికే వెనకా ముందూ చూడకుండా వ్రాసుకుపోతున్నాడు."

సిద్ధాన్నం!

పట్టరాని వాళ్ళందరి కాళ్ళూపట్టి యీ ముగ్గురు కొడుకులకూ బి. ఏ. అయిందనిపించారు.

"వాళ్ళకు వారాలు కుదిర్చేసరికి తాతమ్మలు దిగి చక్కావచ్చేవారు." తెల్లకాగితాలు తప్ప అచ్చుపుస్తకాలు ఒక్కడికీ కొనలేకపోయాడు తను! అప్పుడు తాను 'లేనివాడని' చెప్పుకుంటూ తన అధోగతిని నలుగురిలో వెల్లడించుకున్నా

ఆయనేం బాధపడలేదు.

"అందుకే అంతా వందలమీద పట్టాలు తెచ్చుకున్నారు."

అయినా ఉత్తుత్తి బి.ఏ. లంటే అనుకున్నంత 'ధర' గిట్టకపోవచ్చని పెద్దాడిని బి. యి. డి., రెండుమూళ్ళను క్రమశః టైపూ మరియూ షార్ట్ హేండ్, ఉత్త టైపుమాత్రమే చెప్పించి 'కృతార్థులయా'రని వీని 'మా కుర్రాళ్ళేమీ చవటలుకారు' అని తలెగరేసారు!

అధమ పక్షం తలకొక ఆరువేలేనా తేలేక పోతారా అని! అయినా దౌర్భాగ్యం! చూస్తూండగానే పథకం తలక్రిందులయింది.

"బొమ్మా - బొరుసూ" ఎన్నిసార్లు వేసినా 'వెధవ బోడిబొమ్మే' దాపురించేది. ఆరువేలూ రావడం అంత సులభం కాదంటూ...

మధ్యతరగతి వాళ్ళంతా తిరిగి పోతున్నారు, ఉన్న రెండెకరాలూ ముగ్గురు కొడుకులకూ ఏం పంచుతాడనుకుంటూ!

ఉన్నవాళ్ళ "ఊసు" యిక్కడ అనవసరం! పోతే, మిగిలినవాళ్ళు ఎలాగో పిల్లనిచ్చినా, ఆ మొత్తంమీమి, యీ పిల్లకట్నం—ఉన్న నలుగు

రాడబడుచుల పెళ్ళిళ్ళకూ హరించుకుపోదా..." అనుకుంటూ వెనుకడుగు వేయడానికి శకునం చూసుకుంటున్నారు!

తానందరికీ ఒహటి సమాధానం చెబుతాడు:

"మావాడా...అబ్బ! పొగుడుకోకూడదుగానీ 'సిద్ధాన్నం' గాదటండీ! రేపో ఎల్లుండో నెలకు వందాయేథైయో, రెండువందాయాథైయో తెచ్చి 'నీ' పిల్లకొంగునే కడతాడు గాదుటండీ!"

అన్నాకూడా వాళ్ళు 'చంద్రపు మొగాలేసుకుని' తము వినేలాగా తలకొక నిట్టూర్పూ విడుస్తూంటారు, గది గోడలు ప్రతిధ్వనించేలా!

"ఆ...యిల్లాటి 'సిద్ధాన్నాల' నెన్నిటిని చూడటం లేదూ."

(రోజూ రోడ్లమ్మట!)

అన్నట్లుగా చూస్తారు (తీవ్రంగా) తనవైపు! నిజమే వెనుక తన కనుకునేందు కుండేటంత ఆస్తీ-పాస్తీ ఏవీ లేవు!

"పోగా నలుగురాడపిల్లలకీ పెళ్ళిళ్ళు వెలగబెట్టాలింకా, (అయినా రెండోపిల్ల యింకా ఏదో తంటాలు పడుతూనేఉంది. అదృష్టం బాగుంటే దాన్ని దమ్మిడి ఖర్చులేకుండా ('ఏలూరు' రైలు ఖర్చులుకూడా 'అతనే' పెట్టుకుంటాడు! 'లవ్' మేరేజీలో తోసేయవచ్చు!) ఏవో చవకబారు సంబంధాలుచూసి మిగిలినవాళ్ళ 'బరువు' వదిలించుకోవచ్చు."

తనకున్నది ఒక్క పాత పెంకుటిల్లు,తాతమ్మల నాటిది.

కుర్రాళ్ళు ప్రయోజకులైనాక, మేడ వేయిద్దామని-ఏకంగా" అందుకే అది యింకా 'పాత' పెంకుటిల్లే!

పోతే ఉన్న రెండెకరాల సంగతీ సరేసరి! "సుద్ధ బంజరు బాపతు!"

"ఈ పెద్దాడూ, సుద్ధ బద్ధకస్తుల కగ్రేసరుడు" అనుకుంటూ ఉంటారాయన. అప్పుడప్పుడు కొంచెం అవమానంగా!

అందుకే ఉభయపక్షాల లాభనష్టాలు బాగా తర్కించి ('వాడు' జగమెరిగిన బ్రాహ్మణుడు) న్యాయంగా, ఒక వెయ్యి తగ్గించి 'రేటు' అయిదు వేలే నన్నారు.

"పది పంచవర్ష ప్రణాళికలలోచ్చి నాసరే వాడు ఉద్యోగం "లాటిది" సంపాదించడం కల్ల అని లోకులు (!) ముప్పావలా బిళ్ళలమీద ఏనాడో నిశానీలు వేసుకున్నారు పంచెంమీద పై పంచెంగా!

"కుందేటి కొమ్ముతో గోటేబిళ్ళాడుకోవడం అంతకంటె సులభసాధ్యం!"

వాడి పసెప్పుడూ సావిట్లో నులకమంచంమీద కూర్చుని పొక్కులు గిల్లుకోవడమో, పాత'జంపన కొవ్వలి' చేతబట్టుకుని పారాయణ చేయడమో. వీడిలో ఎక్కడా బి. ఏ. పట్టభద్రుడి లక్షణాలు గాని, బి. యి. డి. 'పెద్దమనిషి తరహా' గానీ మచ్చుకు కూడా అవుపించవు. ఈతని దృక్పథంలో 'లోకులు' అంటే కాకులకన్న అధములు. (లోకులంటే బహుశా పిల్లనివ్వడానికివచ్చి 'అప్రయోజకు' డనుకుని వెన్ను చూపినవారు కావచ్చును.)

వంటింటి చుట్టూ తిరుగుతూ 'మహిళాభ్యున్నతి-వగైరాలను గురించి ఆడంగికబుర్లు చెప్పడం యితని హాబీ!

అందుకే వీరయ్యగారు ఉభయత్రా ఆలోచించి ఒక వెయ్యి తగ్గించి 'రేటు' అయిదువేలే నన్నారు.

పోతే రెండవవా డొక విచిత్ర వ్యక్తి!

తన తండ్రి కోరుకునే 'ఆరు వేలూ' ఆయనలో పాతుకుపోయిన 'యిన్‌ఫీరియార్టీ కాంప్లెక్స్' బాపతు 'విషవాయు సంబంధాలు.' తప్పకుండా తాను, కోయదొర తన చెయ్యిచూసి చెప్పినట్లుగా అటూయిటూ 'వారస పురుగు'లంటూ ఎవరూలేని ఓ 'వనిత'చేత వరింపబడుతాడు.

(తోటలో 'పాచిపని' చేసేదాని కొడుకునే ప్రేమించే రాజకుమార్తె లుండగా, కాస్తాకూస్తా చదువూ-సంస్కారం ఉన్న తనలాటివాణ్ణి డబ్బున్న ఏ పిల్లయినా 'లవ్' చేయదా!)

అంతే! ఆ పిల్ల తననుతప్ప మరెవరినీ పెళ్ళి చేసుకోనని భీష్మించుకుని కూర్చుంటుంది!ఆదెబ్బతో ఆ పిల్లను గన్న తండ్రి—తనతండ్రి కోరుకున్నదీ—ఆడబడుచులు కోరుకున్నదీ ముచ్చటగా హెచ్చు తగ్గులేవీ రాకుండా తీర్చి తనను తీసుకుపోయి యింట్లో పెట్టుకుంటాడు.

"సుపీరియారిటీ అంటేనే అది!"

వీరయ్యగారి మూడవ కుమారుడు యింటర్ వెలిగించే రోజుల్లోనే రాజకీయాల్లో ప్రాముఖ్యం

సంపాదించాలని ప్రయత్నాలు ప్రారంభించాడు. ఒక స్ట్రైక్ సందర్భంలో ప్రిన్సిపాల్ మీద చేయి చేసుకున్నందుకు మూడు సంవత్సరాలు 'డిబార్' చేయబడి, పోలీసులకు జైలు బదులు జుర్మానా చెల్లించుకుని 'చావుదప్పి కన్ను లొట్ట పోగొట్టుకు'ని బయట పడ్డాడు. పోయిన ఎన్నికల్లో నాయుడుగారి పార్టీ తరపున ప్రచారం లాంటిది చేస్తూన్న కారణంగా ప్రతిపక్షంవారిని బహిరంగ సభల్లో దుమ్మెత్తి పోయవలసి వచ్చినందుకుగాను పదరు ప్రతిపక్షాలచేత చావుదెబ్బలుతిని ప్రతి పేపర్లోనూ తన ఉదంతం బహిరంగం చేసుకున్నాడు.

అతనికి "యిది నా కుటుంబం...దీని బాగుల కోసం నేను కొంచెం ప్రయత్నం చేయాలి"నే సంకుచితత్వంలేదు. రాజకీయాలే తన జీవిత సర్వస్వం!

ఈతని దృష్టిలో భవిష్యత్‌లో తాను మహత్తరమైన ఖ్యాతిని సముపార్జించుకునేందుకు బహుచక్కటి అవకాశాలు తా నాపాటికే సృష్టించుకున్నాడు.

వీరయ్యగారి దృష్టిలో భారత రాజకీయాకాశంలో (తాత్కాలికంగా నైనా సరే) యీతడు ధృవతారలా కాకపోయినా, కాస్తో కూస్తో ప్రజ్వలిస్తాడు. అదృష్టం బాగుండి ఏ 'యం. పి.' ఛాన్సో కనక తగిలితే...అయ్...తగిలిందంటే...

—అందుకే బాగా ఆలోచించి ఏ పరిస్థితుల్లోనూకూడా పీడి విషయంలో 'ఆరు' వేలకూ ఆరగానీ క్రిందకు దిగిరాకూడదని ఒక దృఢమైన నిశ్చయానికి ఆయనేనాడో బాగానే ఆలోచించి వచ్చేసారు.

ఏవిధంగా చూసినా తన ముగ్గురు కొడుకులకూ ఏ లోటూ లేదు.

ఎవడికి వాడే "సిద్ధాన్నం!"

నిజమేమరి! అంతా అనుకున్నట్లే జరిగితే చాలా బాగుండిపోను. చేసేదీ పెట్టేదీ లేకపోయినా నూనుగు మీసాల విద్యార్థి మొదలు ప్రతీ తలమాసినవాడూ వరకట్నాలకు వ్యతిరేకంగా బల్లలు బ్రద్దలు కొట్టడమే! బేళ్ళకు బేళ్ళు కాగితాలు నలుపుచేసి పారేయడమే!

"ఈ ముగ్గురి పెళ్ళిళ్లు తగలడ్డ తరవాత ఏడవ కూడదూ, యీ సంస్కారాలన్నీ!"

వీరయ్యగారి ముఖం ఒక్కసారి విప్పారింది. తన ఊహాప్రతిభ తననే ఉఱ్ఱూతలూగించింది.

(అలా ఒక్క ముహూర్తకాలం మాత్రమే!)

వీరయ్యగారి ముఖం యిదివరకున్నంత ధీమాగా ప్రశాంతంగా ప్రకాశించటం లేదు.

రేట్లు ప...డి...పో...తు...న్నా...య్!

"పట్ట భద్రుని విలువ (పాట్లు) ప్రజానీకం గుర్తించలేదేమో యిక!"

మీసమున్న బ్రహ్మచారి (పురుషోత్తముడని భావం) మూల్యం వందల్లోకీ—పదుల్లోకి దిగజారుతుందేమో యిక!

సిద్ధాన్నాలు ముసురుతూన్న యీగలతో ముక్కుకంపు కొడుతున్నాయ్. ★

స్వీకారం

ఆంధ్రమహిళ. 12వ వార్షిక సంచిక. డిసెంబరు 55. (ఆంధ్ర మహిళాసభ, మైలాపూరు, మద్రాసు.) 210 పుటలు. వెల: 1 రూపాయి.

మహిళాభ్యున్నతికై శ్రీమతి దుర్గాబాయ్ (దేశముఖ్) స్థాపించిన 'ఆంధ్రమహిళ' మాసపత్రిక తెలుగు పాఠకలోకానికి సుపరిచితం. పత్రిక కప్పుడే పన్నెండేళ్లు నిండినవంటే, సంతోషించని ఆంధ్రహృదయం ఉండదు. శ్రీమతి కె. లక్ష్మీ రఘురామ్‌గారి సంపాదకత్వాన వెలువడుతున్న యీ పత్రిక మహిళాలోకానికి కరదీపికగా శ్లాఘనీయమైన కృషి చేస్తున్నది. త్రివర్ణముఖచిత్రంతో, ప్రముఖుల రచనలతో ప్రత్యేకసంచిక నేత్రపర్వంగా ముద్రించబడింది. సంక్షేమ సంఘకార్యకలాపాల అనుబంధం, కథానికలు, వ్యాసాలు, పాఠకుల అభిమానాన్ని చూరగొనగల్గే వెన్నో ఉన్నాయి. ఆంధ్ర మహిళలలో చక్కని పఠనాభిరుచి కలిగించి వినోదానికి విజ్ఞానానికి ఉపకరించే యీ సంచికను మహిళలు ఆదరించగలరు.